క్లుప్తంగా

అన్నదానం



నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం, అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అర్చకులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హేమాత ఇండస్ట్రీస్ యాజమాన్యం స్వాములు, భక్తులకు అన్నదానం చేసింది. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, పిన్న రామనాథం, శింగిరికొండ వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' సోషల్ ఆడిట్

నెక్కొండ: నేడు (బుధవారం) స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ (ప్రజావేదిక) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉయదం 10 గంటలకు జరిగే ఆడిట్‌లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్ సమీపంలోని పేకాట స్థావరంపై దాడి చేసి జాన్ షరీఫ్, భోలే మియా, రహీమ్, జిలానీ, ఖాసీమ్, హున్నూర్ షా, జుబేర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. స్కూల్ సమీపంలో పలువురు పేకాడుతున్నారనే సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఆయన మీడియాకు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... దుగ్గొండి మండలంలోని మందపల్లికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నర్సంపేట నుంచి నెక్కొండ వైపు వెళ్లుండగా జల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొట్టారు. ఈ క్రమంలో ఇద్దరికీ గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం

వర్ధన్నపేట: మండల కేంద్రానికి చెందిన తుమ్మల బాబు (50) అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. బాబు మృతి చెందిన సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పందించి స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఇచ్చిన సూచన మేరకు తొలుత నాయకులు బాబు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాగా ఎమ్మెల్యే నాగరాజు బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబాన్నా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ సమ్మెట సుధీర్, నాయకులు అఫ్సర్, వడ్లకొండ ఎల్లాగౌడ్, కొండేటి బాలకృష్ణ, బండి కుమార్, కొండేటి సుధాకర్, చింత మురళీ, తుమ్మల యాకూబ్, గోధుమల విక్కీ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన మహోత్సవం

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం వైభవంగా కొనసాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం యాగశాల, అంకురారోపణం, ధ్వజారోహనం కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, కోగిల్వాయి గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో దూప, దీప నైవేద్యం సమర్పించారు. కాగా నేడు ఉదయం 8.49 గంటలకు మంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ పున్నం సంపత్ తెలిపారు. కమిటీ సభ్యులు బాబురావు, అంకూస్, సదాశివుడు, కైలాష్, రాజు, రమేష్, రాజ్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'నమ్మకాన్ని నిలుపుకుంటాం'

ఆత్మకూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం అందించి ప్రభుత్వం ఏర్పాటుకు ముఖ్యులైన ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేరుస్తామని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని పోగొట్టుకోమని చెప్పారు. ప్రజాసంక్షేమం దిశగా పాలన సాగుతుందని స్పష్టం చేశారు. నియంత పాలనకు ముగింపు పలికిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ రుణపడి ఉంటుందన్నారు.



చెన్నారావుపేట : తడిసిన పత్తిపంట



ఖానాపురం : వర్షంలో తడవకుండా ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

అకాల వర్షం.. అపార నష్టం..

దుగ్గొండి: అకాలవర్షం అపార నష్టం కలిగించింది. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి వరి, మిరప, పత్తి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట కళ్లెదుటే నేలపాలవుతుండడంతో రైతన్నలు తీవ్ర వేదనకు గురౌతున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షం కురిస్తే వానాకాలం పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు 5100 ఎకరాల్లో వరి, 13 వేల ఎకరాల్లో పత్తి, 3800 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఇటీవలే వరి కోతలు మొదలయ్యాయి. ఇంకా 75 శాతం కోయాల్సి ఉంది. మిరప తోటలు మంచి కాపులో ఉండి కాయలు పండు దశలో ఉన్నాయి. వర్షం కారణంగా వరి, మిరప నేలవాలాయి. కొన్నిచోట్ల కోసిన వరి మొదళ్లు తడిచి దెబ్బతిన్నాయి. పండిన మిరప కాయలు తాలుగా మారే ప్రమాదం నెలకొంది. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టిన రైతులు తలలు పట్టుకుంటున్నారు.

చెన్నారావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో రెండ్రోజులుగా వర్షం కురుస్తుండడంతో మిర్చి తోటలు పూత రాలడంతోపాటు పత్తి ఏరకపోవడంతో తడిచి దెబ్బతిన్నాయి. వరి పొలాల్లో పంటలు తడిసిపోతున్నాయి. చేతికందిన పంటలు వర్షం పాలవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



చెన్నారావుపేట : ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు



చెన్నారావుపేట : దెబ్బతిన్న మిర్చి పంట

ఖానాపురం: మండల వ్యాప్తంగా రైతులు వర్షాలు పత్తి, మిర్చి, వరి పంటలు నష్టపోయారు. రైతులు పాకాల ఆయకట్టు పరిధిలో వరి కోతలు ఇప్పటికే ప్రారంభించారు. వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు ఖాళీ స్థలాలు, సబ్‌మార్కెట్ యార్డులు, రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. కొందరు బస్తాల్లో నింపుకోగా మరికొందరు విక్రయించుకోవడానికి సిద్ధమయ్యారు. కాగా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. సబ్‌మార్కెట్‌లో, ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని తడవకుండా టాటిపత్రిలతో కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



దుగ్గొండి: రేకంపల్లిలో నేలవాలిన వరి పొలాన్ని చూపుతున్న రైతు

ఆవులకు కృత్రిమ గర్భధారణతో మేలు

నర్సంపేట రూరల్ : ఆవులకు, గేదెలకు కృత్రి గర్భధారణతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా పశు వైద్యాధికారి బాలకృష్ణ, హైదరాబాద్‌కు చెందిన పశు వైద్య విశ్వవిద్యాలయ ప్రధాన శాస్త్రవేత్త రామచంద్రారెడ్డి తెలిపారు. నర్సంపేట ప్రాంతీయ పశు వైద్యశాలలో కృత్రిమ పిండోత్పత్తి ప్రయోగశాల శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సరందర్భంగా బాలకృష్ణ, రామచంద్రారెడ్డి మాట్లాడారు. శిబిరంలో 40 ఆవులను పరీక్షించి పిండ మార్పిడికి అనుకూలంగా ఉన్న 15 ఆవులను ఎంపిక చేసి అవన్నీ ఒకే రోజు ఎదకు వచ్చేలా చికిత్స అందించినట్లు తెలిపారు. ఈనెల 14 వరకు అవి ఎదకు వస్తాయని, 21న పరీక్షించి కృత్రిమంగా అభివృద్ధి చేసిన సాహివాల్ ఆడదూడల పిండాలను సదరు ఆవుల గర్భాశయంలో ప్రవేశపెట్టి చూలు నిలిచేలా చేస్తామన్నారు. తద్వారా జన్మించిన దూడలు పెరిగి పెద్దవైతే కనీసం రోజుకు 8 నుంచి 10 లీటర్ల పాలు ఇచ్చే సామర్థ్యం కలిగి ఉంటాయని చెప్పారు. ఈత కాలంలో 3-4 వేల లీటర్ల పాలు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయక సంచాలకులు బీఎస్.రెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మి, పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి బాలకృష్ణ, తదితరులు

'కోదండరామ్‌కు కీలక పదవి రావాలి'



రాయపర్తి: తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవి రావాలని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య దర్గయ్య నాయక్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన కోదండరాంను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం దర్గయ్య నాయక్ మాట్లాడారు. తెలంగాణ ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేరేలా కోదండరాంకు పదవి రావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

గ్రామాల వారీగా పోలైన ఓట్లు

- జల్లి, పాపయ్యపేట మినహా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ హవా..

చెన్నారావుపేట: అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలోని 30 గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు దొంతి మాధవరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. లింగాపురంలో కాంగ్రెస్‌కు 735, బీఆర్ఎస్‌కు 491 (కాంగ్రెస్ లీడ్ 244), ఉప్పరపల్లి, జీడిగడ్డ తండా గ్రామంలో కాంగ్రెస్‌కు 1494, బీఆర్ఎస్‌కు 1109 (కాంగ్రెస్ లీడ్ 385), కోనాపురం, కాల్‌నాయక్‌తండా కాంగ్రెస్‌కు 1450, బీఆర్ఎస్‌కు 864 (కాంగ్రెస్ లీడ్ 586), అక్కల్‌చెడ గ్రామంలో కాంగ్రెస్‌కు 612, బీఆర్ఎస్‌కు 401 (కాంగ్రెస్ లీడ్ 211), జోజిపేట నారాయణ తండాలో కాంగ్రెస్‌కు 208, బీఆర్ఎస్‌కు 143 (కాంగ్రెస్ లీడ్ 65), చెన్నారావుపేటలో కాంగ్రెస్‌కు 1810, బీఆర్ఎస్‌కు 832 (కాంగ్రెస్ లీడ్ 978), సూర్యపేట తండా, గొల్లపల్లి, గొల్లభామ తండాలో కాంగ్రెస్‌కు 654, బీఆర్ఎస్‌కు 338 (కాంగ్రెస్ లీడ్ 316), ఖాధర్‌పేటలో కాంగ్రెస్‌కు 409, బీఆర్ఎస్‌కు 376 (కాంగ్రెస్ లీడ్ 33), అమీనాబాద్, పత్తినాయక్ తండాలో కాంగ్రెస్‌కు 1251, బీఆర్ఎస్‌కు 572 (కాంగ్రెస్ లీడ్ 679), బాపునగర్, కందిగడ్డతండా, కాంగ్రెస్‌కు 826, బీఆర్ఎస్‌కు 435 (కాంగ్రెస్ లీడ్ 391), జల్లి లో కాంగ్రెస్‌కు 707, బీఆర్ఎస్‌కు 972 (బీఆర్ఎస్ లీడ్ 265), తిమ్మరాయినిపహాడ్‌లో కాంగ్రెస్‌కు 627, బీఆర్ఎస్‌కు 498 (కాంగ్రెస్ లీడ్ 129), పాపయ్యపేటలో కాంగ్రెస్‌కు 717, బీఆర్ఎస్‌కు 744 (బీఆర్ఎస్ లీడ్ 27) బోజేర్వు, పుల్లయ్యబోడు తండాలో కాంగ్రెస్‌కు 692, బీఆర్ఎస్‌కు 396 (కాంగ్రెస్ లీడ్ 296), ధర్మతండా(హట్యతండా)లో కాంగ్రెస్‌కు 698, బీఆర్ఎస్‌కు 501 (కాంగ్రెస్ లీడ్ 197), ఎల్లయ్యగూడెంలో కాంగ్రెస్‌కు 655, బీఆర్ఎస్‌కు 446 (కాంగ్రెస్ లీడ్ 209), అమృతండా (చెరువు కొమ్ముతండా, పదహారుచింతల్ తండా, బోడ మాణిక్యతండా)లో కాంగ్రెస్ 628, బీఆర్ఎస్‌కు 626 (కాంగ్రెస్ లీడ్ 02), లింగగిరి, తోపనగడ్డతండాలో కాంగ్రెస్‌కు 1113, బీఆర్ఎస్‌కు 852 (కాంగ్రెస్ లీడ్ 261) ఓట్లు పోలయ్యాయి. మండలంలో కాంగ్రెస్‌కు 4762 లీడ్ రాగా బీఆర్ఎస్‌కు జల్లిలో 265, పాపయ్యపేటలో 27 ఓట్లు వచ్చాయి. దొంతి మాధవరెడ్డికి సొంత మండలం కావడంతో ప్రజలు అభిమానాన్ని ఓట్ల రూపంలో చూపించారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి



నల్లబెల్లి: భారత్ గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని స్థానిక జ్యోతి భారత్ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ గాదె సునీత కోరారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆదేశాల మేరకు స్థానిక ఏజెన్సీలో పలువురు గ్యాస్ వినియోగదారుల ఈ-కేవైసీని మంగళవారం ఆమె నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డు, గ్యాస్ బుక్ తీసుకొచ్చి వేలిముద్రలతో గ్యాస్ కనెక్షన్‌ను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. గ్యాస్ బుక్ చేసుకునే వినియోగదారులు సెల్ నంబర్ 7715012345, 7718022345ల్లో ఆన్‌లైన్ ద్వారా 24 గంటలు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం కార్యాలయ సమయంలో సెల్ నంబర్ 9441666391, 9440466391ల్లో సంప్రదించాలని చెప్పారు.

బిట్స్‌లో వలంటీర్స్ డే వేడుకలు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల (బిట్స్)లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్నేషనల్ వలంటీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1985 డిసెంబర్ 17న చేసిన తీర్మానం మేరకు ఏటా డిసెంబర్ 5న స్వచ్ఛంద దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఐక్యసమితితో రెడ్‌క్రాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి అనేక స్వచ్ఛంద సంస్థలు సేవకు సహకారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిహరన్, సెక్రెటరీ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సంపత్, శ్యాంసుందర్, భానురేఖ, అకాడమిక్ డీన్ నారాయణ, ఏఓ సురేశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పవన కుమారి, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

నెక్కొండ: నర్సంపేట ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన దొంతి మాధవరెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలిచి ఎన్ని ఆశలు చూపినా నాటి బీఆర్ఎస్‌లో చేరకుండా కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి నుంచి పార్టీ పురోగతికి పాటుపడుతూ శ్రేణులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అన్ని అర్హతలున్న మాధవరెడ్డికి మంత్రి పదవి రావాలని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు ఈదునూరి దిలీప్, సింగం ప్రశాంత్, శ్రీకాంత్, క్రాంతి, విజయ్, వినీత్, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు న్యాయం

ఖానాపురం: కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గెలుపు సందర్భంగా దివ్యాంగ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం హరిబాబు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో బడుగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయడంలో ఎమ్మెల్యే దొంతి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భిక్షంరెడ్డి, వేణు, శ్రీనివాస్, రవి, జగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పొగాకు ప్రాణాంతకం

దామెర: పొగాకు అలవాటు ప్రాణాంతకమని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఓగ్లాపూర్ గ్రామ సమీపంలోని మైనారిటీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పొగాకు అలవాటు కారణంగా క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని తెలిపారు. గుట్కా, పాన్, సిగరేట్ ఇతర పొగాకు ఉత్పత్తులను స్వీకరించే అలవాటుకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే లెప్రెసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెల్లమచ్చల బారిన పడిన విద్యార్థులను గుర్తించి వైద్య పరీక్షలు చేశారు. అవగాహన పెంచుకోవడం ద్వారా రోగాల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీహెచ్ఈఓ శ్రీనివాస్, సీహెచ్ఓ రామచందర్, డీపీఎంఓ రవీందర్, కొమురయ్య, గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీలత, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, నరేష్, ఏఎన్ఎంలు సౌందర్య, భారతి, రజిత పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తా

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో ప్రస్తుత ఎమ్మెల్యేకు సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు తనను మరచిపోయిన తాను ప్రజలను మరచిపోనని చెప్పారు. నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ఫలితం నేపథ్యంలో తాను పని విధానంలో మార్పులు చేసుకోవాలనే విషయాన్ని గమనించినట్లు చెప్పారు. నర్సంపేటలో అవినీతి రహిత పాలన అందించినట్లు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఐదేళ్లకు ఓసారి వచ్చే నాయకుడినే ప్రజలు కోరుకున్నారనే చర్చ జరగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిధిలో విజన్‌తో ముందుకు వెళ్లే అవసరం లేకుండా పోయిందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పథకాలు తెచ్చినట్లు తెలిపారు. నర్సంపేటలో పెండింగ్‌లో ఉన్న ఆయకట్టు కాల్వలు, పల్లె దవాఖానలు, బ్రిడ్జిల పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అనేక రకాలుగా నర్సంపేటలో అభివృద్ధి చేయాలని డిజైన్లు తయారు చేసి పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రజల తీర్పు నేపథ్యంలో తాను ఏమీ చేయలేని దుస్థితి నెలకొందని చెప్పారు. తాను తెచ్చిన పనులను ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజల కోసం పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, బండి రమేష్, నాగిశెట్టి ప్రసాద్, దార్ల రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

మెరుగైన విద్యాబోధనే ఇన్‌స్పెక్షన్ లక్ష్యం

పర్వతగిరి: విద్యాబోధనలో మెరుగుదల తీసుకురావడమే లక్ష్యంగా ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ చేసినట్లు మండల నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి తెలిపారు. మండలంలోని కేజీబీవీలో మంగళవారం ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. కొంకపాక కాంప్లెక్స్ హెచ్ఎం ఎ.భిక్షపతి టీం లీడర్‌గా ఏడుగురు విషయ నిపుణుల సమక్షంలో విద్యాలయంలోని ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసన ప్రగతి, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో మౌళిక వసతులు, వాటి అమలును అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా టీం లీడర్ భిక్షపతి మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి బోధన అభ్యసన ప్రక్రియను మెరుగు పర్చడానికి ఇన్‌స్పెక్షన్ తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించడంతోపాటు విద్యాశాఖకు సమగ్ర నివేదికను సమర్పించారు. ప్యానెల్ ఇన్‌స్పెక్షన్‌లో ఎం.భాస్కర్, వి.నర్సింహారావు, హఫీజ్, బి.రాములు, పి.రమేశ్ బాబు, జి.రమేశ్, సీహెచ్.శ్రీను భాగస్వాములు కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, సీఆర్పీ శ్రీనివాస్, సీఓ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన ప్రగతిని తెలుసుకుంటున్న ప్యానెల్ టీం సభ్యులు

కోమటికుంట కట్టను పరిరక్షించాలి

వర్ధన్నపేట: కోమటికుంట కట్టను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని దానిని కబ్జా నుంచి పరిరక్షించాలని మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, బీఆర్ఎస్ ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో సాగునీటి శాఖ ఇంజనీరింగ్ అధికారులకు, కలెక్టరేట్ ఏఓకు, ఆర్డీఓకు రాతపూర్వకంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి, శ్రీనివాస మాట్లాడారు. గ్రామంలో కొందరు కుంట కట్టను ధ్వంసం చేసి వెంచర్లు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు నాంపెల్లి యాకయ్య, బచ్చు యాదగిరి, రాయబారపు బుచ్చిబాబు, శ్రీరామోజు యాకాంబ్రం, పోశాల విజేందర్ తదితరులున్నారు.



కలెక్టరేట్ ఏఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుడికి ఘనసన్మానం

గీసుకొండ: మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. గీసుగొండ శివారులోని గట్టుకిందిపల్లి సమీపంలో బాలకిషోర్‌రెడ్డి సొంత ఖర్చులతో మంగళవారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు పలు గ్రామాల నుంచి శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజయం సాధించేలా బాలకిషోర్‌రెడ్డి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అనంతరం బాలకిషోర్‌రెడ్డి మాట్లాడారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లో రావడం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడిగా శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు సాయిలి ప్రభాకర్, మాదాసి రాంబాబు, దౌడు భరత్, కొమ్ము శ్రీకాంత్, జావిద్, ఎంపీటీసీ గోపాల్, నాగరాజు, మర్రెడ్డి పాల్గొన్నారు.



బాలకిషోర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దొంతికి మెజార్టీ అభినందనీయం

చెన్నారావుపేట: నర్సంపేట ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన దొంతి మాధవరెడ్డికి గ్రామ ప్రజలు మెజార్టీ అందించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాబలం ముందు ధనబలాన్ని ప్రజలు ఓడించారంటూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాధవరెడ్డికి 978 ఓట్ల మెజార్టీ అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, కుమారస్వామి, ఎల్లాగౌడ్, ప్రతాపరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య